క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



నర్సాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సునీతా రెడ్డిని పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సునీతారెడ్డిని స్థానిక బీఆర్ఎస్ నాయకులు నయీమొద్దీన్, భిక్షపతి, నర్సింలు, ప్రసాద్, రాకేష్‌గౌడ్ తదితరులు శాలువాలతో సన్మానించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులివ్వాలి



చేగుంటలో దప్పుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దూరి కృష్ణ అన్నారు. శనివారం ఎంఆర్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో చేగుంట గాంధీ చౌరస్తా వద్ద దప్పుల ప్రదరన్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. మాదిగలకు 11శాతం రిజర్వేషన్‌తో పాటు రెండు మంత్రి పదవులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు సాయిబాబా, రాములు, చిన్న ఎల్లం, సంజీవులు, మల్లేశం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ నాయకులు.

నర్సాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి శనివారం మొదటిసారి నర్సాపూర్‌కు వచ్చిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. అంజిరెడ్డిని, ఆయన సతీమణి సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి పెద్ద రమేష్‌గౌడ్, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్ పార్టీ నాయకులు బాల్‌రాజ్, శంకర్, నారాయణరెడ్డి, రాంరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్)లో..



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): ఎమ్మెల్సీ అంజిరెడ్డిని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ రామచంద్రాపురంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కృష్ణ, భూషణం తదితరులు ఉన్నారు.

మహిళా వైద్యసిబ్బందికి సన్మానం



కౌడిపల్లి సీహెచ్‌సీలో మహిళ డాక్టర్లు, సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం సీహెచ్‌సీలో మహిళ డాక్టర్లతోపాటు వైద్యసిబ్బందిని అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వెంకటలక్ష్మి, మహిమ, కీర్తి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వనితకు వందనం

ఘనంగా మహిళా దినోత్సవం

జిల్లాలో శనివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల మహిళా ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.



పెద్దశంకరంపేట(మెదక్): ఎన్‌హెచ్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



చిన్నశంకరంపేట(మెదక్):విద్యార్థిని అంకితను అభినందిస్తున్న జడ్జి లక్ష్మీశారద



చిన్నశంకరంపేట(మెదక్):చిన్నశంకరంపేటలో అంగన్వాడీ టీచర్లను సన్మానించిన ఎన్ఆర్ఐ చంద్రశేఖర్

పెద్దశంకరంపేట(మెదక్): మహిళలు తమ హక్కుల సాధనకు నిరంతరంగా కృషి చేయాలని 161వ నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవి అన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ రహదారి కార్యాలయంలో, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఉద్యోగులను జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహిళలు, పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్స్ ఇంజనీర్ మహ్మద్ రహమాన్, మేనేజర్ మొయినొద్దీన్, సైట్ ఇంజనీర్ కిరణ్, ప్రశాంత్, ఎస్ఐ.శంకర్, ఏఎస్ఐ.సునీత తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్న మహిళలకు సమాజంలో గౌరవం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చిన్నశంకరంపేటకు చెందిన ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో పాటు మహిళ పోలీసులను ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను అభినందించారు. ధైర్యంగా మహిళలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, యువజన సంఘం సభ్యులు స్వామి, శ్రీమన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ప్లేయర్ అంకితకు అభినందనలు

చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థి అంకిత జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో ప్రతిభను చూపడంతో మహిళ దినోత్సవం సందర్భంగా మెదక్ సివిల్ జ్యుడీషియల్ జడ్జి లక్ష్మీశారద అభినందించారు. శనివారం మెదక్ పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడాశాఖ నిర్వహించిన మహిళ దినోత్సవ కార్యక్రమంలో మడూర్ విద్యార్థిని అభినందించి సన్మానించినట్లు పాఠశాల హెచ్ఎం రవీందర్‌రెడ్డి, పీడీ నరేష్ తెలిపారు.

మహిళా కానిస్టేబుళ్లకు సన్మానం

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో అలుపెరుగకుండా పురుషులతో సమానంగా పనిచేస్తూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు అశ్వక్, తబుసం, పుష్పలు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం

రామాయంపేట(మెదక్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా కార్మికులను సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. అనంతరం కార్మికులకు టిఫిన్ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీనివాసశర్మ, సత్యం, రమేష్, దేమో యాదగిరి, పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): మహిళా కార్మికులను సన్మినిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను పలు గ్రామాలలో నిర్వహించారు. శనివారం మనోహరాబాద్ మండలం పర్కిబండలో ఓబీసీ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌సింగ్ ఆధ్వర్యంలో మహిళలను శాలువాతో సత్కరించారు. జీడిపల్లి గ్రామంలో సుధాకర్ ఆధ్వర్యంలో, కూచారంలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటతో పాటు పలు గ్రామాల్లో మహిళ దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. చేగుంటలోని గ్రామ పంచాయతీ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ చీరలను అందించి శాలువాలతో సన్మానించారు. చిన్నశివునూర్ మాజీ సర్పంచు అశోక్ గ్రామంలోని మహిళ సంఘాల సభ్యులను సన్మానించారు.

మహిళ దినోత్సవ వేడుకలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దొంతి గ్రామంలో లయన్స్ క్లబ్ ఎల్‌టీ బాలానగర్ డాక్టర్ విశ్వనాథం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతరావు, రాహుల్ ఉన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



నర్సాపూర్‌లోని ఓ పాఠశాలలో పని చేసే మహిళ ఉద్యోగులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేతో పాటు మహిళా ఉద్యోగులను సన్మానించారు. పట్టణంలోని డాన్ బాస్కో పాఠశాలలో శనివారం వార్షికోత్సవం ఏర్పాటు చేయగా.. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా, అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు తమ పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హవేళిఘణాపూర్(మెదక్): మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది



మనోహరాబాద్(తూప్రాన్): పర్కిబండలో మహిళలను సత్కరిస్తున్న నాయకులు



చేగుంట(తూప్రాన్): పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్



శివ్వంపేట(నర్సాపూర్): మహిళ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

చాకరిమెట్లలో భక్తుల పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు స్వామివారికి అభిషేకం, మాన్యసూక్తపారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవాదత్త శర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ శర్మ, శ్రీవాత్సవ్‌శర్మ ఉన్నారు.

చెట్ల కొమ్మలతో ప్రజల ఇబ్బందులు

తొలగింపజేసిన సీఐ విద్యాసాగర్



కొమ్మలు తొలగింపజేస్తున్న సీఐ విద్యాసాగర్

కొండపాక(గజ్వేల్): మండలంలోని రాంపల్లి, దుద్దెడ గ్రామాల శివారులో రాజీవ్ రహదారిలో రోడ్డుకు రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను పోలీసు అధికారులు శనివారం తొలగింపజేశారు. రాజీవ్ రహదారి పక్కన పోలీస్ కమిషనర్ కార్యాలయం, ఆక్సిజన్ పార్కులను గత ప్రభుత్వం నిర్మించింది. మర్పడ్గ, ఖమ్మంపల్లి, సిర్సనగండ్ల, రాంపల్లితో పాటు మరి కొన్ని గ్రామాల ప్రజలు నిత్యం పనులపై అక్కడికి వెళ్తుంటారు. అయితే ఆ దారిలో పెరిగిన చెట్ల కొమ్మలు ప్రయాణానికి ఆటంకంగా మారాయి. అది గుర్తించిన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, పోలీస్ హౌజింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్ జేసీబీ సహాయంతో కొమ్మలు, చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ రోడ్డు గుండా కొన్ని గ్రామాల ప్రజలు నిత్యం ఆక్సిజన్ పార్కు, పోలీస్ కమిషనర్ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలకు వెళ్తుంటారని, కొమ్మలు పెరగడంతో మూల మలుపుల వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అది గుర్తించి కొమ్మలను తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో పోలీసులు శ్రీహరి, అశోక్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అడవిలో మంటలు



నర్సాపూర్ అడవిలో వ్యాపించిన మంటలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తుకారాం తండా సమీపంలో అడవిలో మంటలు అంటుకున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు మంటలు చెలరేగుతున్నాయి. తండావాసులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా.. రాత్రి 11 గంటల వరకు అదుపులోకి రాలేదు.

ముదిరిన జల వివాదం



రైతులను సముదాయిస్తున్న ఇరిగేషన్ అధికారులు

నంగునూరు(సిద్దిపేట): రెండు మండలాల మధ్య కొద్ది రోజులుగా నెలకొన్న జల వివాదం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. రంగనాయకసాగర్ కుడి కాల్వ నీటిని చేర్యాల మండలంలోని కొన్ని గ్రామాలకు మళ్లించేందుకు అధికారులు ప్రయత్నించగా నంగునూరు రైతులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. నంగునూరు మండలం నుంచి పారే రంగనాయక సాగర్ కుడి కాల్వ ఎల్‌డీ -10పై చేర్యాల మండలం కమలాయపల్లి వద్ద ఓటీ నిర్మాణం చేపడుతారనే సమాచారంతో నంగునూరు రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి కమలాయపల్లి వచ్చి ఇక్కడి రైతులకు సాగు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం ఇరిగేషన్ అధికారులు రంగనాయక సాగర్ నీటిని మళ్లించేందుకు రాగానే బీఆర్ఎస్ నాయకులు రైతులతో వెళ్లి పనులను అడ్డుకున్నారు. దీంతో కమలాయపల్లి, దానంపల్లి రైతులు వారితో వాగ్వాదానికి దిగడంతో తోపులాటకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ జేఈఈ రాజు, చేర్యాల హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇరు వర్గాల వారికి నచ్చజెప్పారు. పంటలు ఎండిపోతున్నందున తాత్కాలికంగా నీటిని మళ్లిస్తున్నామని నంగునూరు మండలానికి నష్టం జరుగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగారు. దీంతో నీటి మళ్లింపును పూర్తి చేసి కమలాయపల్లికి నీరు తరలించారు.

కూలీలకు అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని పనులను ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ శనివారం పరిశీలించారు. కూలీలకు అవగాహన కల్పించారు. ప్రతీ పంచాయతీలో 60 మంది కూలీలకు పనులు కల్పించాలని టీఏలకు, ఎఫ్ఏలకు ఆయన సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు వివరించారు.

విద్యుత్ ప్రమాదంలో దుకాణం దగ్ధం

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ ప్రమాదంలో కిరాణదుకాణం దగ్ధమైంది. ఈ ఘటన మనోహరాబాద్ మండలం రామాయపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రామాయపల్లికి చెందిన బండి యాదమ్మ కిరాణ దుకాణం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంది. ఎప్పటిలాగే శుక్రవారం దుకాణం మూసేసి ఇంటికి చేరుకున్నారు. అనంతరం విద్యుత్ ప్రమాదానికి గురై పూర్తి దగ్ధమైంది.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పద్మారెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని పేరూర్‌లో శనివారం నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కృపతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు హన్మంత్ రెడ్డి, సీతారామయ్య, జయరాంరెడ్డి, కిష్టయ్య, ప్రభాకర్, నరేందర్‌రెడ్డి, సంజీవ రెడ్డి, నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అహిల్య నారి శక్తి అవార్డును అందుకున్న యువతులు



అవార్డును అందుకున్న స్వాతి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాకు చెందిన ధనావత్ స్వరూప, చందాపూర్ గ్రామానికి చెందిన తలారి స్వాతి అహిల్య నారి శక్తి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో అహిల్య ఉమెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పూనమ్ నోములార్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. గ్రామాలలో విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ కోసం అందిస్తున్న సేవలకు ఈ అవార్డును పొందారని సానిక్ష ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు.

స్పెషల్ క్యాజ్‌వల్ సెలవు ఇవ్వరా?



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేగుంట(తూప్రాన్): అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజైనా గురుకుల మహిళ ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజ్‌వల్ సెలవు ఇవ్వరా అని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ డిమాండ్ చేశబూరు. చేగుంటలో శనివారం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు సైతం గురుకుల మహిళ ఉద్యోగులను కచ్చితంగా విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించడం సమంజసం కాదన్నారు. గురుకులాల సమయ పాలనను మార్పు చేయాలని, రాత్రి సమయాల్లో మహిళ ఉపాధ్యాయులకు నైట్‌కేర్ టేకర్ విధుల నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జగన్, తదితరులు

చేగుంట(తూప్రాన్): భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. చేగుంట బీసీ బాలుర వసతి గృహం వద్ద శనివారం చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బడులు మూత పడుతున్నాయని ఆరోపించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నియామక అర్హతలను సవరించడం సమంజసం కాదన్నారు. దీనికోసం ఈనెల 27న విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు వంశీ, రాకేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డంపు యార్డును ఎత్తివేయండి

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: డంప్‌యార్డును ఎత్తి వేయాలన్న డిమాండుతో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 20వ రోజుకు చేరాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తివేయాలన్న డిమాండుతో జేఏసీ ఆధ్వర్యంలో 20 రోజులుగా నర్సాపూర్‌లో రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. దీక్షలలో జేఏసీ నాయకులు మురళీయాదవ్, రాజేందర్, సత్యంగౌడ్, రమణరావు, బుచ్చేష్, యాదగిరి, /జ్ఞానేశ్వర్, జగదీశ్వర్, ప్రభాకర్‌రావు, చంద్రయ్య, నర్సింలు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొని దీక్ష శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. డంప్‌యార్డుతో నర్సాపూర్‌కు ఎక్కువ నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా ఆరుతడి పంటలు



కాద్లూర్ శివారులో సాగుతున్న జొన్నపంట

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు ఆరుతడి పంటలను ఆసక్తి చూపుతున్నారు. కూరగాయల పంటలతో పాటు జొన్న, శనగ, మొక్కజొన్న వంటి పంటలను పండించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వాణిజ్యపంట అయిన పత్తి సాగు చేస్తున్నప్పటికీ యాసంగిలో తక్కువ నీటితో ఆరుతడి పంటలను పండిస్తున్నారు. టేక్మాల్ మండలం కాద్లూర్, పల్వంచ, ఎల్లుపేట, ఎల్లంపల్లి, అచ్చన్నపల్లి, కుసంగి, బర్దిపూర్, బొడ్మట్‌పల్లి, తంప్లూర్ తదితర గ్రామాల్లో రబీ పంటలు అత్యధికంగా సాగు చేస్తున్నారు. శనగా పంటలు కొంత మంది రైతులు కోతలు కోస్తున్నా, మరికొంత మంది రైతులు ధాన్యం సిద్ధం చేసి అమ్మకానికి ఉంచారు. ఎకరాకు సుమారుగా 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నట్లు చెబుతున్నారు. గోధుమ, జొన్న, మొక్కజొన్న, ఉల్లిగడ్డ సాగుతో పాటు అన్ని రకాల కూరగాయలు తక్కువ నీటితో సాగు చేస్తున్నారు. సుమారుగా 400ఎకరాల వరకు సాగుతున్నారు. పండిస్తున్న పంటలను కాపాడుకునేందుకు పంట చుట్టూ చీరలు కట్టడం, మైకులు పెట్టడం, తీగలు కట్టడం చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు.